# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

అనునిత్యం ప్రజల పక్షం

TELTEL12273

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న

తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో

పనిచేయుటకు జిల్లా బ్యూరో , స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన
యువతి యువకులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209



వరంగల్ సంపుటి : 2 సంచిక : 156 ఆదివారం 7 - 07 - 2024 పేజీలు : 08 వెల : 5




## ప్రజాభవన్ వేదికగా ఇరు రాష్ట్రాల


# సిఎంల భేటీ



- అధికారులు, మంత్రుల సమక్షంలో సమావేశం
- పరస్పరం పుష్పగుచ్ఛాలతో అభినందనలు

**హైదరాబాద్,జూలై6తెలంగాణ ముచ్చట్లు :** రెండు తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై ప్రజా భవన్‌లో ఇద్దరు సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు సమావేశమయ్యారు. తొలుత తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రజాభవన్‌కు చేరుకున్నారు. తరవాత చంద్రబాబు వచ్చారు. ఆయనకు సిఎం రేవంత్ పుష్పగుచ్ఛం అందచేసి గనంగా స్వాగతించారు. చంద్రబాబు కూడా రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందించారు. ఇలా మంత్రులు కూడా పుష్పగుచ్చాలు అందించి స్వగతించారు. పరస్పర పుష్పగుఛ్చాలతో

2 లో



### కాంగ్రెస్‌లో చేరిన

## మరో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే

**బండ్లను కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవని బీఆర్ఎస్ కు వరుస షాకులు తగులుతున్నాయి. మొన్న ఆరుగురు ఎమ్మెల్యేలు,

2 లో

### రసాభాసగా గ్రేటర్

## కార్పోరేషన్ సమావేశం

- బిజెపి, బిఆర్‌ఎస్ కార్పోరేటర్ల ఆందోళన
- మేయర్ పోడియం చుట్టుముట్టి రాజీనామాకు డిమాండ్
- ప్లకార్డులు ప్రదర్శించిన బిఆర్‌ఎస్ కార్పోరేటర్లు



**హైదరాబాద్,జూలై6తెలంగాణ ముచ్చట్లు :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొమ్మిదో కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. బీఆర్ఎస్ ,బీజేపీ కార్పొరేటర్లు సమావేశం ప్రారంభానికి ముందే ప్రధాన కార్యాలయం ఆవరణలో ఆందోళనకు దిగారు. అనంతరం శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కాగా.. నిరసనలతో కొద్ది నిమిషాల్లోనే మీటింగ్ గందరగోళంగా మారింది. బీఆర్ ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. ఆమె పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని.. మేయర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మేయర్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని మేయర్ అన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. మీటింగ్ 15 నిమిషాలు వాయిదా వేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

2 లో



### మంత్రి శ్రీధర్ బాబుతో

## విపక్ష ఎమ్మెల్యే భేటీ

- నియోజవర్గ అభివృద్ధికి సహకరించాలని వినతి
- ఎమ్మెల్యేలు కలవడంపై సర్వత్రా చర్చ

**హైదరాబాద్,జూలై6 తెలంగాణ ముచ్చట్లు :** రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబును శనివారం భారాస ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, వివేకానందగౌడ, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి కలిశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు మంత్రికి అందజేశారు. జీహెచ్ఎంసీకి నిధులు విడుదల చేయాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును ఈ ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు ప్రతిపాదనలను మంత్రి శ్రీధర్ బాబుకు అందించారు ఎమ్మెల్యేలు. జీహెచ్ఎంసీకి నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నుంచి జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వలేదన్నారు. కూకట్ పల్లి నియోజకర్గంలోని చెరువులు, కుంటల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్క

2 లో

### బాధిత కుటుంబాలకు

# అండగా ఉంటా

**గేమ్‌జోన్ బాధితులకు రాహుల్ పరామర్శ**




**అహ్మదాబాద్,జూలై6తెలంగాణ ముచ్చట్లు :** : కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గుజరాత్ లో పర్యటిస్తున్నారు. కొన్నేళ్లలో వివిధ ఘటనలు, ప్రమాదాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. లోక్‌సభలో సమస్యలపై ప్రజల తరఫున గళమెత్తుతానని మాటిచ్చారు. ఇటీవల రాజ్‌కోట్‌లోని గేమ్‌జోన్‌లో

2 లో

### 22నుంచి పార్లమెంట్

## బడ్జెట్ సమావేశాలు

- ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు
- 23న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నిర్మలా సీతారామన్
- వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు




**న్యూఢిల్లీ,జూలై6 :** సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించి, నరేంద్రమోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే కూటమి కొలువుదీరిన వేళ..ఇటీవలే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం జులై 23న బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

2 లో

### సికింద్రాబాద్-గోవా మధ్య నేరుగా బైవీక్లీ

## రైల్వే శాఖ నిర్ణయంపై

## కిషన్ రెడ్డి కృతజ్ఞతలు



**హైదరాబాద్,జూలై6 తెలంగాణ ముచ్చట్లు :** తెలుగు రాష్ట్రాలనుంచి గోవా వెళ్లే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడగామా(గోవా) వెళ్లేందుకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించనుంది. దీంతో ఇక నేరుగా గోవాకు సర్వీస్ అందుబాటులోకి రానుంది. రైల్వేశాఖ నిర్ణయంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతు తెలిపారు. ఇప్పటివ రకు వారానికి ఒక రైలు 10 బోగీలతో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి గుంతకల్ చేరుకుని అక్కడ తిరుపతి నుంచి గోవాకు వెళ్లే మరో 10 బోగీలతో కలిపి ఒక నూతన రైలుగా మారి గోవాకు ప్రయాణం సాగించేది. ఇది కాకుండా కాచిగూడ - యలహంక మధ్య వారానికి 4 రోజులు ప్రయాణం సాగించే రైలుకు గోవాకు వెళ్ళే 4 కోచ్‌లను కలిపేవారు. ఈ 4 కోచ్ లను తిరిగి గుంతకల్ వద్ద షాలిమార్ - గోవా

2 లో

# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల సమస్యలపై సత్వరం స్పందించాలి

పేరుకు ఎన్‌డిఎ ప్రభుత్వం అయినా పూర్తి మెజార్టీతో బిజెపికి ఉండడంతో గత పదేళ్లుగా బిజెపి చెప్పిన విధంగానే ప్రభుత్వం నడిచింది. ఇంతకాలం దాని మాటే సాగుతూ వచ్చింది. అయితే ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాలది పైచేయిగా ఉంది. ఈ క్రమంలో బడ్జెట్‌కు ముందు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు, మంత్రులు ప్రధాని మోడీ సహా, కేంద్రమంత్రులను కలిశారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరారు. విభజన సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. తెలంగాణ పరిస్థితి ఎలా ఉన్నా ఎపి సిఎం చంద్రబాబు మాటకు విలువ ఇస్తారా లేదా అన్నది చూడాలి. నష్టపోయిన ఎపిని ఆదుకోవాలని చంద్రబాబు అభ్యర్థిం చారు. గత రెండ్రోజులుగా ఢిల్లీలో మకాం వేసిన చంద్రబాబు ప్రధాని మోడీ, నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్, నడ్డా తదితరులను కలిసి ఎపికి ఇతోధిక సాయం అందించాలని కోరారు. ఇదే తరహాలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా ప్రధాని మోడీ, కేంద్రమంత్రులను కలిసి విన్నవించారు. ఇలాంటి విషయాల్లో ఇక దాటవేత ధోరణులు పనికిరాదు. నేరుగ ఆసాయం అందించాలి. ఇరు తెలుగు రాష్ట్రాల పురోగతికి తోడ్పడాలి. ఇంతకుముందు మిత్రపక్షాలుగా ఉన్న కొన్ని పార్టీలు కేవలం నామమాత్రంగా ప్రభుత్వంలో కొనసాగాయి. దీంతో మోడీ నిర్ణయాలను ప్రశ్నించలేక పోయారు. ఇప్పుడలా ఉంటుందా లేదా అన్నది త్వరలోనే తేలనుంది. బడ్జెట్ కేటాయింపులతో పాటు, రాష్ట్రాలు ప్రతిపాదించే అంశాలకు ఏ మేరకు విలువ ఇస్తారన్నది కూడా చూడాలి. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా ప్రధాని మోడీని, కేంద్రమంత్రులను కలిసి పలు అంశాలను ప్రస్తావించారు. ఇవి ఏ మేరకు అమలు చేస్తారన్నది కూడా చూడాలి. గతంలో ఎన్‌డిఎ పక్షాల సమావేశాలు..చర్చలు ఉండేవి. వాజ్‌పేయ్ హయాంలో అన్ని పక్షాలను కలుపుకుని పోయే అవకాశం ఉండేది. పార్టీలో కూడా చర్చలు ఉండేవి. కానీ మోడీ పగ్గాలు చేపట్టాక గత పదేళ్లలో అలాంటి అవకాశం లేదు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఏకపక్ష నిర్ణయాలపై ఎవరిని అడగాలో ఎవరికీ తెలియదు. పూర్తి మెజార్టీతో నరేంద్రమోడీ అధికారం చేపట్టిన తరవాత పదేళ్లుగా ఎన్‌డిఎ పార్టీలకు సంకటంగా మారింది. సొంత పార్టీలోనూ ఆయనను ఎదరించేవారు కరువయ్యారు. దీంతో ప్రధానిగా మోడీ నిర్ణయాలు తీసుకుం టున్నారే తప్ప వాటి పర్యవసానాలను పరిశీలించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించుకోకుండా ఆర్థిక సంస్కరణల పేరుతో బురిడీ కొట్టించారు. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాలది కొంత మెరుగ్గా ఉంది. వారికి ప్రశ్నించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎపి సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు నిలదీసే అవాకాశం ఉంది. నితీశ్ కుమార్‌కు కూడా అంతే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాలు ప్రతిపాదించే అంశాలను మోడీ ఎలా పరిష్కరిస్తారో చూడాలి. అమరావతి నిర్మాణం, పోలవరం, విశ్వాఖ ఉక్కు ఫ్యాక్టరీల విషయంలో వ్యూహం ఎలా ఉండబోతున్నదే చూడాలి. మోడీ ఏకపక్ష నిర్ణయాల కారణంగానే మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా తీర్పు ఇచ్చారు. అయితే తనకు బలముందున్న ధోరణి ప్రవర్తిస్తే ప్రజలు తమకు సమయం వచ్చినప్పుడు తమ నిర్ణయం తీసుకంటారని రుజువు చేశారు. దేశంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. వ్యక్తిగతంగా నష్టపోయే ప్రమాదేమీ మోడీకి లేకపోవచ్చు. ఇలా ఒంటెద్దు పోకడలతో పోతే నష్టపోయేది బిజెపి మాత్రమే. నియంతృత్వ పోకడలు విడనాడకుంటే వాజ్‌పేయి, అద్వానీ లాంటి అతిరథ మహారథులు తీర్చిదిద్దిన బిజెపికి ఎదురీత తప్పకపోవచ్చు. తెలంగాణలో బిజెపిని వ్యతిరేకించే వారు మళ్లీ కాంగ్రెస్ పంచన చేరుతున్నాయని, వ్యక్తులు కూడా చేరుతారని గమనించాలి. పప్పు ముద్దంటూ రాహుల్ ను ఇంతకాలం విమర్శిస్తూ వచ్చిన నేతలకు కర్నాటక ఫలితాలు చెంపదెబ్బకొట్టి చూపాయి. ఈ ప్రమాదాలను బిజెపి ద్వయం గుర్తించడం లేదు. ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ పోవడం కన్నా ప్రజలను గుర్తించి పనిచేసుకుంటూ పోవాలి. ఇకపోతే పెడ ధోరణిలో మోడీ కూడా మిత్రపక్షాలను పెద్దగా పట్టించుకోకపోతే ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ఇకనుంచయినా ఎన్‌డిఎ పక్షాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై గతంలో టీడీపీ అసంతృప్తి వ్యక్తం చేసినా దానికి తగ్గట్లుగా కార్యాచరణకు దిగలేదు. వాజపేయి హయాంలో ఎన్డీఏ నిర్మాణం జరిగినా అప్పుడు రాష్ట్రాలకు విలువ ఉండేది. కానీ మోదీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలకు అవకాశాలు దక్కడం లేదు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న నిరంకుశ నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. విపక్షాలు ఏకతాటిపైకి రావడంతో బీజేపీకి కొంత బలం తగ్గింది. పూర్తిస్థాయి మెజార్టీని సంపాదించుకోలేక పోయింది. ఏపీ విభజన జరిగినపుడు ప్రత్యేక హోదా కల్పిస్తామని పార్లమెంటు వేదికపైనే వాగ్దానం చేశారు. దాన్ని అమలు చేయకపోవడం సరైనది కాదు. బీజేపీ సంకీర్ణ ధర్మాన్ని పాటించకుండా బెదరింపు ధోరణిలో ప్రవర్తించింది.మోడీ వ్యవహార శైలి ఇలాగే ఉంటే దేశంలో బిజెపికి ఎదురీత తప్పకపోవచ్చు. అందువల్ల ఇప్పుడు రాష్ట్రాలను, ఎన్‌డిఎ పక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.

## కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల

### ఎక్స్ అఫీషియో మెంబర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అశోక్ రెడ్డి



ప్రకాశం, తెలంగాణ ముచ్చట్లు : ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గారు పాల్గొన్నారు. శాసనసభ్యు లుగా ఎన్నికైన అనంతరం మొదటి సారిగా హాజరైన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గారు కౌన్సిల్ ఎక్స్ అఫీషియో మెంబర్ గా ప్రమాణ స్వీకారం చేశారు. కౌన్సిల్ తీర్మానంలోని అంశాలను పరిశీలించి వాటికీ ఆమోదం తెలియచేశారు.

## ప్రజాభవన్ వేదికగా ఇరు రాష్ట్రాల సిఎంల భేటీ

స్వాగత కార్యక్రమం సాగింది. అనంతరం ఇరు రాష్ట్రాల అధికారులు, మంత్రులు, సిఎంలు భేటీ అయ్యారు. ఈ సందర్భందగా తెలంగాణ ప్రముఖ కవి కాళోజీ నారాయణ రాసిన 'నా గొడవ' కవితల సంకలనాన్ని చంద్రబాబుకు రేవంత్ రెడ్డి కానుకగా ఇచ్చారు. ఇకపోతే ఈ సమావేశానికి ఏపీ ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు, మంత్రులు కందుల దుర్గేశ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ, మరో ఇద్దరు అధికారులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, చీఫ్ సెక్రటరీ పలువురు ఐఏఎస్ అధికారులు హాజరయ్యారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శనివారం నిర్వహించిన ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిల కీలక భేటీ ముగిసింది. దాదాపు గంటా నలబై ఐదు నిమిషాల పాటు వీరి భేటీ కొనసాగింది. పది ఏళ్లుగా పరిష్కారం కాని రాష్ట్ర విభజన సమస్యలపై పరిష్కారానికి ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రెండు కమిటీలు ఏర్పాటు చేయాలని భేటీలో నిర్ణయించారు. మంత్రులతో ఓ కమిటీ, అధికారులతో మరో కమిటీ వేయాలని రెండు రాష్ట్రాల సీఎంలు నిర్ణయం తీసుకున్నారు. మంత్రుల కమిటీలో తెలంగాణ నుంచి పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఉండే అవకాశం ఉంది. తెలంగాణ సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు వెంకటేశ్వరస్వామి ఫొటోను ఏపీ సీఎం చంద్రబాబు బహూకరించారు. చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు విభజన సమస్యల పరిష్కారం కోసం భేటీని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరీ స్వాగతించారు. ప్రజా భవన్‌లో జరుగుతోన్న ఈ భేటీతో తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న పలు అంశాలు పరిష్కారం కానున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు.

## 22నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

మరోమారు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల సంవత్సరం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నిర్మలమ్మ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను తీసుకొస్తున్నారు. మోదీ 3.0లో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్ ఇదే. దీంతో వరసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను నిర్మలా సీతారామన్ అందుకోనున్నారు. ఇప్పటి వరకు మొరార్జీ దేశాయ్ వరసగా ఆరుసార్లు బడ్జెట్ సమర్పించారు. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామన్‌కు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా గుర్తింపు పొందారు. ఎప్పటిలా సూట్‌కేసులో కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బడ్జెట్ సమర్పణ తేదీలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారంనాడు ప్రకటించారు. జూలై 22వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై ఆగస్టు 12వ తేదీతో ముగుస్తాయని,బడ్జెట్ సమావేశాల రెండో రోజైన జూలై 23న కేంద్రబడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి తెలిపారు. భారత ప్రభుత్వం సిఫారసుల మేరకు పార్లమెంటుబడ్జెట్ సమావేశాలు జరిపేందుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌ను జూలై 23వతేదీన లోక్‌సకు సమర్పిస్తాం' అని రిజిజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం విశేషం. ఈసారి బడ్జెట్‌లో పలు చారిత్రక నిర్ణయాలు తీసుకోనున్నారనే అంచనాలు కూడా బలంగానే ఉన్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## రసాభాసగా గ్రేటర్ కార్పోరేషన్ సమావేశం

వాయిదా అనంతరం సమావేశాలు తిరిగి ప్రారంభం కాగా.. నేతలు తమ పరిధిలోని సమస్యలను ఏకరవు పెట్టారు. బల్దియా కౌన్సిల్ సమావేశానికి కాంగ్రెస్ ,బీఆర్ఎస్, ఎంఐఎం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు, బీజేపీ నేతలు హాజరయ్యారు. కాగా, మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు. మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత, మరికొంత మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో వీరి రాజీనామాకు పట్టుబట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన గ్రేటర్ ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని నిర్దేశిరచింది. పార్టీ మారిన మేయర్ రాజీనామా డిమాండ్, ఇతర సమస్యలపై బహిరంగంగా ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు. 150 మంది కార్పొరేటర్లలో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలు. మరో ఇద్దరు ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు చనిపోయారు. ప్రస్తుతం 47 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. ఎంఐఎంకు 41 మంది, బీజేపీకి 39, కాంగ్రెస్‌కు 19 మంది సభ్యులున్నారు. దాదాపు నాలుగున్నర నెలల తర్వాత జరుగుతున్న కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్ని పార్టీలకు సంబంధించి 23 ప్రశ్నలతో సుదీర్ఘంగా చర్చ సాగేలా సభ సిద్ధమైంది. ఈ క్రమంలో సమావేశం ప్రారంభం కాగానే.. బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసనతో సభ రసాభాసగా మారింది. అనంతరం నగరంలో పారిశుద్ధ్యం సరిగ్గా లేదని.. మేయర్ సహా అధికారులు చోద్యం చూస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర నేతలు సైతం జీహెచ్ఎంసీ పరిధిలోని సమస్యలు ఏకరవు పెట్టారు. వానా కాలం సమీపించినా నాలాల్లో పూడిక తీత పనులు జరగట్లేదని ఆందోళనకు దిగారు. చెరువులు కబ్జాకు గురవుతున్నాయని.. ఖాళీ పైపులు, గుర్రపు డెక్కలతో కొందరు కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు.

## గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో రైతులకు సేవలు నామమాత్రమే




తెలంగాణ ముచ్చట్లు : ప్రకా శం జిల్లా ప్రకా శం జిల్లా పశువుల సంత రుసం వసూల్లో సిబ్బంది చేతివాటం. మార్కెట్ కమిటీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది జిల్లా స్థాయి గెజిటెడ్ అధికారులు కాదు... కానీ రైతులు చెల్లించే నగదుతో కార్యాలయానికి 5 శీతలీకరణ యంత్రాలు అమర్చుకొని విలాసం చేస్తున్న మార్కెటింగ్ యార్డు సిబ్బంది. ఏడాది తిరుగకముందే నాసిరకం పనులతో గోడలకు పగుళ్లు. కార్యాలయం ఆవరణ గోడలకు నాసిరకంగా ప్లాస్టింగ్.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాహుల్ గాంధీ పరామర్శించినట్లు కాంగ్రెస్ తెలిపింది. 2022లో మోర్బి వంతెన కూలడం, రాజ్‌కోట్‌లోని టీఆర్‌పీ గేమ్ జోన్‌లో అగ్నిప్రమాదం, ఇతర ప్రమాదాలకు ప్రభావితమైన బాధితులు కాంగ్రెస్ కార్యాలయంలోని రాహుల్‌ని కలిసి సమస్యలను చెప్పుకున్నారు. ఆయా ప్రమాదాలకు కారణమైన నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని.. ఏళ్లుగా పోరాడుతున్నా తమకు న్యాయం జరగడం లేదని మొరపెట్టుకున్నారు. బాధితుల సమస్యలను విన్న రాహుల్.. వారి తరఫున లోక్‌సభలో గళమెత్తు తానంటూ హామీ ఇచ్చారు. న్యాయం జరిగేంత వరకు పోరాడుతానంటూ బాధిత కుటుంబాలకు మాటిచ్చారు.

## సికింద్రాబాద్-గోవా మధ్య నేరుగా బైవీక్లీ

### రైల్వే శాఖ నిర్ణయంపై కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

మధ్యన తిరిగే రైలుకు కలిపి ప్రయాణం సాగించేవారు. ఇప్పుడు సికింద్రాబాద్-వాస్కోడగామా (గోవా) మధ్య బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించడంతో ప్రధాని మోదీ, రైల్వే శాఖమంత్రి అశ్వినీవైష్ణవ్‌లకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ చుట్టపక్కల ప్రాంతాల నుంచి గోవా వెళ్లే పర్యటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నూతన సర్వీసు అందుబాటులోకి రావడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్-గోవా బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్, బళ్లారి, హోస్పేట, కొప్పల్, గడగ్, హుబ్బళ్లి, ధార్వాడ్, లోండా, క్యాసిల్ రాక్, కులెం, సాన్వోర్‌డెమ్, మడగావ్ జంక్షన్లలో ఆగుతూ.. వాస్కోడగామా చేరుకుంటుందని రైల్వేశాఖ వెల్లడించింది.

## మంత్రి శ్రీధర్ బాబుతో విపక్ష ఎమ్మెల్యే భేటీ

తొలగించాలని.. దోమలను నివారించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. నియోజకర్గంలోని అన్ని డివిజన్ లలో ఎలక్ట్రికల్ పోల్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కూకట్ పల్లి, మూసాపేట్ సర్కిళ్ళ పరిధిలో నెలకొన్న శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని, అలాగే కూకట్ పల్లి నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాలకు అతీతంగా పనులు చేయడం జరుగుతుందన్నారు. తప్పకుండా మీ సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రిని కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా రేపో మాపో బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని ఇప్పటికే పలువురు మంత్రులు చెప్పిన సంగతి తెలిసిందే..

## కాంగ్రెస్‌లో చేరిన మరో బిఆర్ఎస్ ఎమ్మెల్యే

ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ చేరగా... తాజాగా మరో ఎమ్మెల్యే కాంగ్రెస్ గూటికి చేరారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్ రెడ్డిల సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కాంగ్రెస్ లోకి బండ్ల చేరికతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఒక్క అలంపూర్ స్థానం మినహా బీఆర్ఎస్ ఖాళీ అయ్యింది. అలంపూర్ నుండి విజయుడు బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఏడురుగు ఎమ్మెల్యేలు చేయిని అందిపుచ్చుకున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక



## బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించాలి

### - మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం పెద్దమందడి మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రం ఎస్సీ కామ్యూనిటీ హాలులో ఘనంగా ఆయన వర్ధంతిని నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి వెంకటస్వామి మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నాయకుడని, స్వాతంత్ర సమరయోధుడిగా, ఓటమి ఎరగని రాజకీయ నాయకుడిగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి అధికార ప్రతినిధి ఎస్, కురుమూర్తి ,దోడగుంటపల్లి చెన్నకేశవులు చెన్నయ్య ,కొమ్ము కృష్ణయ్య ,కొమ్ము బ్రహ్మం ఎస్, బాలకృష్ణ ఏస్,వెంకటస్వామి కొమ్ము, విష్ణు యం, శేఖర్ ఎస్, శివ ఎస్, కురుమూర్తి ఎస్, భీముడు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు కరుణగిరిలోని ఫోర్త్ ఎంప్లాయిన్ చర్చిని సందర్శిస్తారు. ఆ తర్వాత ఉదయం 8: 30 గంటలకు వీడియోస్ కాలనీలోని సాయిబాబా గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. 9 గంటలకు సీపీఎం జిల్లా కార్యాలయానికి, ఉదయం 10 గంటలకు సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) కార్యాలయానికి ఎంపీ రఘురాం రెడ్డి వెళ్ళనున్నారు. ఎన్నికలప్పుడు తనకు మద్దతునిచ్చి భారీ విజయాన్ని కృషి చేసినందుకు నాయకులు, శ్రేణులకు కృతజ్ఞతలు తెలుపునున్నారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి ఎస్ ఆర్ గార్డెన్స్ సమీపంలోని తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ప్రజలు నేరుగా వచ్చి తనను కలవొచ్చని, సమస్యలపై వినతులు ఇవ్వొచ్చని ఈ సందర్భంగా ఎంపీ ఒక ప్రకటనలో తెలిపారు.

## హౌసింగ్ లేఔట్ ను పరిశీలించిన ప్రాజెక్టు డైరెక్టర్



**పులివెందుల,తెలంగాణ ముచ్చట్లు :** పులివెందుల పట్టణంలో నిర్మిస్తున్న మెగా లేఔట్ ను శనివారం హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో 8400 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని పులివెందుల పట్టణంలోని మెగా లేఔట్ లో 7075 గృహములు నిర్మించడం జరుగుతుందని ఇందుకు సంబంధించి లేఔట్ లోని సిమెంటు, స్టీలు, ఇసుక తదితర సామాగ్రి పరిశీలించడం జరిగింది. లేఔట్ నందు మెటీరియల్ దొంగతనం కాకుండా లే అవుట్ కు భద్రతగా కొంతమంది సిబ్బందిని ఉంచాలన్నారు.

# మధిరలో నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన

### - ముదిగొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
### - ప్రజాభవన్ నుంచి రేపు ఉదయం మధిరకు బయలుదేరనున్న డిప్యూటి సీఎం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటిస్తారు. మధిర నియోజకవర్గంలోని చింతకాని, ముదిగొండ మండలాల్లోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. ఆదివారం ప్రజాభవన్ నుంచి ఉదయం 7గంటలకు మధిరకు రోడ్డు మార్గం ద్వారా డిప్యూటి సీఎం బయలుదేరుతారు. ఉదయం 10.15 గంటలకు ఖమ్మం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు డిప్యూటి సీఎం కి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం వల్లాపురం గ్రామానికి చేరుకుంటారు. వల్లాపురం- గంధసిరి గ్రామాల మధ్యన బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తరువాత మధ్యాహ్నం 11.45 గంధసిరి చేరుకొని అక్కడ గంధసిరి - పెద్ద మండవ బి.టి రోడ్ మరియు గంధసిరి - అమ్మపేట(వెలగొండస్వామి) రోడ్ శంఖుస్థాపన చేస్తారు అనంతరం భాణాపురం చేరుకొని అక్కడ గంధసిరి - బాణాపురం రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు తరువాత పెద్దమండవకు చేరుకొని మల్లారం- పెద్దమండవ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆతరువాత మధ్యాహ్నం 1.45 గంటలకు వల్లభి గ్రామానికి చేరుకుంటారు. భోజన విరామం ఆనంతరం వల్లభి-మంగాపురం తండా గ్రామాల మధ్యన బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే వల్లభి- ఆంజనేయస్వామి దేవాలయం మధ్యన బిటి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఆనంతరం మల్లారం గ్రామానికి చేరుకుంటారు. గంధ్రాయి - మల్లారం, మల్కాపురం- మల్లారం గ్రామాల మధ్యన బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఆనంతరం స్ధానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రోడ్డు మార్గాన తిరిగి హైదరాబాద్కు బయలుదేరుతారు.



## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించాలి

### -గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు & మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికారప్రతినిధి

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:** జూలై -6 న డా. బాబూ జగ్జీవన్ రామ్ గారి 38 వ వర్ధంతి సందర్భంగా మందకృష్ణ మాదిగ నాయకత్వం బలపరుస్తూ ఏస్ సి కమ్యూనిటీ హాల్ ముందు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గంగారపు శ్రీనివాస్ మాదిగ, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తూ వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, దళిత హక్కుల పరిరక్షకుడు, పరిపాలన దక్షకుడు, భారతదేశ మాజీ ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్ రామ్ 38 వ వర్ధంతి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా జరుగనున్నాయి. దేశసమగ్రతకు, జాతి సమైక్యతకు కృషి చేసి,భారత రాజ్యాంగానికి కాపలాదారుడుగా వ్యవహరించి దళితుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆ మహనీయుని ఆశయాలను ఈ దేశంలో ఉండే ప్రతి పౌరుడు కొనసాగించలని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పుట్ట దేవరాజు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, కొట్టే శంకర్,జి శ్రీనివాస్ కె రవి మునిగాల కరియప్ప కొట్టే శంకర్ రాహుల్ రమేష్ పాల్గొన్నారు.

### రాష్ట్రంలో వర్షాలు మొదలవడంతో

# ప్లాంటేషన్ ఒక పండుగలా చేపడుతున్నాం

### -రాష్ట్ర ఆటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్






**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్రంలో వర్షాలు మొదలవడంతో ప్లాంటేషన్ ఒక పండుగలా చేపడుతున్నట్లు రాష్ట్ర ఆటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి వన మహోత్సవంపై అధికారులతో అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొక్కలు నాటడంలో ప్రతీసారి ఖమ్మం జిల్లానే టాప్ గా నిలుస్తుందన్నారు. జిల్లా లక్ష్యం 31.06 లక్షల మొక్కలు నాటడం త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గతంలో నాటిన మొక్కల సంరక్షణ చేయాలని, చనిపోయిన మొక్కల స్థానే క్రొత్త మొక్కలు నాటాలని అన్నారు. లక్ష్యం సాధన మాత్రమే కాక, పూర్తిలో నాణ్యత పాటించాలన్నారు. గతంలో ఏ ప్రాంతంలో ఏ మొక్క బాగుగా పెరిగింది, ఏ ప్రాంతంలో ఏ ఏ మొక్కలు నాటాలి, ఏ మొక్కలు మనుగడ పొందుతాయో చూడాలన్నారు. మంచి సమయంలోగా మొక్కలు నాటితే మనుగడకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, యువత, పిల్లలు, అన్ని వర్గాల వారిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. మొక్కల ప్రాధాన్యత పై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లా రోడ్ మ్యాప్ ను అనుసరించి, ప్లాంటింగ్ కాని ప్రాంతాల్లో ప్లాంటింగ్ చేయాలన్నారు. సింగరేణి స్థలాల్లో పచ్చదనం పెరిగేలా ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలో మునగ, నిమ్మ, కరివేపాకు మొక్కలు ఖచ్చితంగా వుండేలా చూడాలన్నారు. డిమాండ్ మేరకు మొక్కలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రాధాన్యత కార్యక్రమంగా విజయవంతం చేయాలని అన్నారు. జిల్లాకు 31.06 లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉన్నట్లు, ఇట్టి లక్ష్యాన్ని వివిధ శాఖల ద్వారా పూర్తి చేయుటకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అటవీ శాఖ ద్వారా 7.60 లక్షలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ చే 10 లక్షలు, నీటిపారుదల శాఖచే 1.06 లక్షలు, వ్యవసాయ శాఖ చే 2.70 లక్షలు, ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ ద్వారా 1.80 లక్షలు, ఎక్సైజ్ శాఖచే 60 వేలు, మునిసిపాలిటీల ద్వారా 4.78 లక్షలు, విద్యా శాఖ చే 30 వేలు, పరిశ్రమల శాఖచే 30 వేలు, గనుల శాఖచే 60 వేలు, విద్యుత్, సింగరేణి ల ద్వారా 1.32 లక్షల మొక్కలు నాటుటకు ప్రణాళిక చేసినట్లు ఆయన అన్నారు. స్థలాల ఎంపిక జాగ్రత్తగా చేయాలని, నాటడమే కాక వాటి నిర్వహణ, సంరక్షణ కు అనువుగా ఉండేట్లు చూడాలన్నారు. వచ్చే 3 సంవత్సరాలకు నిర్వహణ చర్యలపై ఇప్పుడే కార్యాచరణ చేయాలన్నారు. ప్రతి స్థలానికి ఒక బాధ్యతగల వ్యక్తిని కేటాయించి, అతని నుండి మొక్కల పరిస్థితిపై పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులు మొక్కలు నీరు అందించడం, సంరక్షణపై పర్యవేక్షణ చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ తీగల క్రింద మొక్కలు నాటడం లాంటిది చేయకూడదన్నారు. రవాణాకు ఖర్చు ఎక్కువ కాకుండా మొక్కలు నాటుటకు గుర్తించిన స్థలానికి దగ్గర్లోని నర్సరీలను మొక్కల పంపిణీకి ట్యాగ్ చేయాలన్నారు. మీడియన్స్, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు, లే అవుట్లు, కెనాల్స్, రైతు వేదికలు తదితర ప్రదేశాలపై దృష్టి పెట్టాలన్నారు. వచ్చే బుధవారం కల్లా లక్ష్యం పూర్తికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 2015 నుండి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి, గత సంవత్సరం వరకు 14.87 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. చనిపోయిన మొక్కల స్థానంలో క్రొత్త మొక్కలు నాటాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. సైట్, లోకేషన్, నర్సరీల వారిగా కార్యక్రమం పూర్తికి టై అప్ చేసినట్లు తెలిపారు. విఐపి ప్లాంటేషన్ కి ప్లాన్ చేస్తే, అటవీ శాఖ అధికారులను పంపి, మొక్కలు నాటుటకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్డీవో సన్యాసయ్య, జెడ్పి సిఇఓ ఎస్. వినోద్, డిపిఓ హరికిషన్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్ కుమార్, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ సంపత్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా

- జిల్లా మంత్రుల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తా
- జిల్లాకు యునివర్సిటీ కోసం కృషి చేస్తా
- కొత్తగూడెం విమానాశ్రయం, సింగరేణి, స్పాంజ్ ఐరన్, ఇతర పరిశ్రమలపై కేంద్ర మంత్రులతో చర్చిస్తా
- ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి
- ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారి కాంగ్రెస్ కార్యాలయానికి రాగా.. శ్రేణుల ఘన సత్కారం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యలు పరిష్కరించి, తన అవకాశం మేరకు అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతానని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశాక, తొలి సమావేశాల అనంతరం మొదటిసారి జిల్లాకు విచ్చేసిన ఆయన తొలుత నగరంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సాదర స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి భట్టి , మంత్రులు తుమ్మల, పొంగులేటి సారధ్యంలో పనిచేస్తానని అన్నారు.

**భారీ మెజారిటీ అందించిన ప్రజలకు పాదాభివందనం**

తనకు అఖండ మెజారిటీ అందించిన ఉభయ జిల్లాల ప్రజలకు శిరస్సు వంచి వారికి పాదాభివందనం చేస్తున్నానని చెబుతూ.. కృతజ్ఞతలు తెలిపారు. అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గం లో 86వేల మెజారిటీ వచ్చిందని, ప్రతి నియోజకవర్గంలో కూడా 60 వేల మెజారిటీ అందించి ప్రజలు తనకు గురుతర బాధ్యతను అప్పగించారని ఆనందం వ్యక్తం చేశారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని అభయమిచ్చారు.

**పాలేరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదాం**

రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి గతంలో పాలేరులో పలు అభివృద్ధి పనులు చేశారని.. ఆమె సహకారంతో పర్యాటక కేంద్రంగా మలిచేందుకు కృషి చేస్తానని ఎంపీ రఘురాం రెడ్డి అన్నారు. ఈ విషయంపై తాజాగా చర్చించామని, ఇతర పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని అన్నారు.

**జిల్లాకు యూనివర్సిటీ.. కొత్తగూడెంలో విమానాశ్రయంపై..**

ఖమ్మం జిల్లాకు ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ అన్నారు. అలాగే కొత్తగూడెంలో విమానాశ్రయం ప్రాజెక్టు అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉందని.. ఈ అంశంపై ఇటీవల మంత్రి పొంగులేటి కదలిక తెచ్చారని, అది పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. స్పాంజ్ ఐరన్, మిగతా మూతపడిన పరిశ్రమలు తెరిపించేందుకు చర్చిస్తానన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు, కీలక అంశాలపై సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని ఎంపీ అన్నారు.

**రాహుల్ గాంధీ నేతృత్వంలో ముందుకు..**

తాము కేంద్ర ప్రభుత్వానికి శత్రువులం కాదని, దేశాభివృద్ధికి కచ్చితంగా సహకరిస్తామని తమ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్లో ప్రకటించారని ఎంపీ రఘురాంరెడ్డి గుర్తు చేశారు. విపక్షంగా తమను దూరం పెట్టొద్దని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సమాన అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రజల పక్షాన ముందుకు సాగుతామని అన్నారు.

ఈ కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఐ ఎన్ టి యు సి నేత కొత్తా సీతారాములు, నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, బాలగంగాధర్ తిలక్, వడ్డెబోయిన నరసింహారావు, హుస్సేన్, మలీదు వెంకటేశ్వర్లు, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ కు ఎంపీ రఘురాం రెడ్డి నివాళి

## – గుర్రాలపాడు వాసులకు ఆసుపత్రిలో పరామర్శ







**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి నివాళు లర్పించారు. దేశానికి ఆయన ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. ఆ మహనీయుని ఆదర్శాలతో ముందుకు సాగుదామని ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మెరుగైన వైద్యం అందించండి**

వ్యక్తిగత కారణాలతో ఇతరులు గొడ్డలితో దాడి చేయగా తీవ్రంగా గాయపడి నగరంలోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు కు చెందిన దాసరి వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు దాసరి సైదులను ఎంపీ రఘురాం రెడ్డి శనివారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఎంపీ వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్ రావు, కర్లపుడి భద్రకాళి, మద్ది కిషోర్ రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బీ. వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు

# తమ వంతు కృషి చేయాలి

### -రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు తమ వంతు కృషి చేయాలని రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్ అన్నారు. శనివారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో 75వ వన మహోత్సవం పురస్కరించుకుని అటవీ ముఖ్య అధికారిణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొక్కలు మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యమని తెలిపారు. పచ్చని ఖమ్మం జిల్లా, పచ్చని తెలంగాణ కు మనం ప్రతిన బూనాలన్నారు. వాన మహోత్సవం లో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేసి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాకు ఈ వన మహోత్సవంలో భాగంగా 31.06 లక్షల మొక్కలు నాటుటకు ప్రభుత్వం లక్ష్యం ఇచ్చిందన్నారు. ఇట్టి లక్ష్యాన్ని వివిధ శాఖల ద్వారా సాధించుటకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని అటవీ అధికారి అన్నారు. ఈ సందర్భంగా అటవీ బీట్ అధికారి వి. సాంబయ్య అడవుల్లో పెరిగే చెట్ల విత్తనాలను ప్రదర్శించి, అటవీ ఉత్పత్తులు, వాటి ప్రయోజనాలపై అధ్యాపకులు, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. పద్మావతి, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ సంపత్, కళాశాల అధ్యాపకులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోక్ సభ లో మోదీ స్క్రిప్ట్ నే రాష్ట్రపతి చదివారు

- ఈడీ, సీబీఐ రాజకీయ దాడులు ద్రౌపది ముర్ము కు కనిపించవా..?
- కొత్త పార్లమెంట్ భవనం బీజేపీ వాళ్లకు కూడా నచ్చట్లే
- ఖమ్మం ఎంపీ రామ సహాయం రెడ్డి
- సీపీఐ జిల్లా కార్యాలయానికి వెళ్లిన ఆర్ఆర్ఆర్
- విజయానికి కృషి చేసినందుకు ఆ పార్టీ నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు:** ఇటీవల జరిగిన లోక్ సభ సమావేశాలప్పుడు భారత రాష్ట్రపతిద్రౌపది ముర్ము ప్రధాని మోదీ ఇచ్చిన స్క్రిప్ట్ నే చదివారని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి విమర్శించారు. ఎన్నికలఅప్పుడుతనకు మద్దతు నిచ్చిభారీ విజయంలో భాగస్వాములైన సీపీఐ శ్రేణులకు ఖమ్మంలోని ఆపార్టీ జిల్లా కార్యాల యానికి శనివారం వెళ్లి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..కావాలనే, రాజకీయ దురుద్దేశంతోనే ఎమర్జెన్సీ అంశాన్ని ప్రస్తావించారని.. బీజేపీ పాలనలో రాజకీయ కోణంలో జరిగే ఈడీ, సీబీఐ దాడుల ఎమర్జెన్సీ కంటే అది తక్కువేనని అన్నారు.రాష్ట్రపతి ఎమర్జెన్సీ గురించి అంతలా మాట్లాడటం సరికాదని తెలిపారు.

**కార్పొరేట్ తీరు బాలే..**

కొత్త లోక్ సభ భవనం బీజేపీ వాళ్లకు కూడా నచ్చడం లేదని, అది ఓ కార్పొరేట్ ఆఫీస్ తరహాలోనే కనిపిస్తోందని అన్నారు. అప్పట్లో నాన్న లోక్ సభకు వెళ్ళే సమయంలో నేను ఆయన వెంట పోగా అక్కడ విశాలమైన భవనం ఉండేదనీ, కానీ ఇప్పుడు కట్టిన లోక్ సభ అలా లేదని చెప్పారు. స్పీకర్ గా ఎన్నికైన ఓం బిర్లా తో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా వ్యవహరించాలని సూచించినప్పటికీ..ఇండియా కూటమి ఎంపీలు మాట్లాడుతున్నప్పుడు మైక్ ఆఫ్ చేస్తున్నారని, ఇది సరికాదని తెలిపారు. బీజేపీకి మద్దతునిచ్చిన టీడీపీ, ఇతర పార్టీల ఎంపీలు కూడా ఉత్సాహంతో లేరని..అన్నారు. నరేంద్ర మోదీ విధానాలతో తీసుకొచ్చిన అగ్నివీర్ కాంట్రాక్టు పద్ధతితో మన సైన్యం ఆత్మస్థైర్యం దెబ్బతిన్నదని,కొన్నేళ్లలో పాకిస్థాన్ ని ఎదుర్కోవడానికి కూడా సత్తువ ఉండదని ఆర్మీ అధికారులే చెబుతుండడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకునేందుకు ఇండియా కూటమి ఎంపీలు బలంగా పనిచేస్తారని అన్నారు.

**అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తా..**

తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధి మొత్తం పర్యటించి.. శ్రేణులను, ప్రజలను కలుస్తానని ఎంపీ రఘురాం రెడ్డి అన్నారు. తొలుత అశ్వారావుపేట నుంచి అనుకున్నామని, జిల్లా కేంద్రమైన ఖమ్మం నుంచి మొదలెట్టి అన్నిచోట్లకు వెళ్ళబోతున్నానని అన్నారు. తన మన అనే లేకుండా అందరి పక్షాన ఉ ండి ప్రజా సమస్యల పరిష్కరిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు, జిల్లా బాధ్యులు పోటు ప్రసాద్, నాయకులు ద%శీ%డి సురేష్, మహమ్మద్ మౌలానా, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273

# ఓటమి భయంతో సర్పంచ్ ఎన్నికల నిర్వహణపై వెనక్కు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : ఓటమి భయంతో సర్పంచ్ ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం లేదని బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి తెలిపారు. లోకల్ బాడీలు లేకపోతే కేంద్రం నుంచి నిధులు రావని తెలిసినా కూడా ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఏడు నెలల నుంచి జీతాలు రావడం లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్లలె బాట కార్యక్రమానికి వెళ్లాలన్నారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులతో ప్లలె ప్రగతిని నడుపుతోందన్నారు. కాంట్రాక్టర్లు, మంత్రుల కంపెనీలకు ఇవ్వడానికి నిధులు ఉంటాయని.. పారిశుద్ధ్య కార్మికుల జీతాలు ఇవ్వడానికి చేతులు రావని మహేశ్వర రెడ్డి విమర్శించారు. ఒబీ రికార్డ్ అయిన 12 వందల కోట్ల రూపాయల సర్పంచ్ బిల్లులు ఇంత వరకు రాలేదని.. మిడ్ డే మీల్స్ కార్మికులకు కూడా ఏడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని మహేశ్వరరెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీలో తెలంగాణకు చిన్న నష్టం జరిగినా ఊరుకునేది లేదన్నారు. తెలంగాణ స్పీకర్ కనబడటం లేదని.. ఆయనకు పంపించిన రిజిస్టర్ పోస్టులు తిరిగి వస్తున్నాయని తెలిపారు. అసెంబ్లీ అడ్రస్ తప్పని.. కావాలనే తిప్పి పంపుతున్నట్లు తెలుస్తోందని మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్పీకర్ తప్పించుకుని తిరిగినా కూడా అసెంబ్లీ సమావేశాల్లో దొరుకుతారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపైన ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# కాళేశ్వరం ఇంజనీర్లను విచారించనున్న కమిషన్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ హౌస్ ఇంజినీర్లను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. లక్ష్మి, సరస్వతి, పార్వతి పంప్‌హౌస్ ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించనుంది. ఈ మూడు పంప్‌హౌస్‌లకు చెందిన సీఈ నుంచి ఏఈఈల హోదాల్లో పనిచేసే ఇంజినీర్లు సోమవారం కమిషన్ ఎదుట హాజరుకానున్నారు. కాళేశ్వరానికి సంబంధించిన దస్త్రాలు ఇవ్వాలని ఇదివరకే ప్రభుత్వానికి కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రెండు వారాల్లోగా అన్ని దస్త్రాలు అప్పగించాలని స్పష్టం చేసింది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నుంచి తుది నివేదికలు కోరింది. పుణెలోని సీడబ్ల్యూపీఆర్‌కు తమ ప్రతినిధిని పంపించి కమిషన్ అధ్యయనం చేయించింది. నిపుణుల కమిటీ నుంచి కూడా పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కోరింది. అఫిడవిట్ల పరిశీలన తర్వాత నోటీసులు జారీ చేయనుంది.

# నలుగురు సభ్యుల చోరీ ముఠా అరెస్ట్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : శామీర్‌పేట్‌లోని చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు సభ్యులను ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని శామీర్‌పేట్ పోలీసులకు అప్పగించారు. వ్యాపారవేత్తలు, సినిమా నిర్మాతల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ముఠా సభ్యులు శామీర్‌పేట్ పోతాయిపల్లి గ్రామంలోని ఓ వ్యాపారి నివాసంలో చోరీకి ముఠా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని... దాని భగ్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ముఠా సభ్యుల నుంచి కత్తులు, మూడు ద్విచక్రవాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# అంబులెన్స్ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్,తెలంగాణ ముచ్చట్లు : జిల్లా కేంద్రంలో శనివారం ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కాలం కంటే ముందు నుంచి ఇప్పటివరకు సొసైటీ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు. ఆపత్కాలంలో ఆపద్బాంధవుడిలా ఈ సొసైటీ పని చేస్తుందని, రాబోయే కాలంలోనూ సమాజ హిత కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు లాలా మున్నా, రాజేష్, జోగు రవి, ప్రవీణ్, సాయి, సందీప్, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# అన్ని సమస్యలపై కమిటీల్లో చర్చ

- పరస్పర అవగాహనతో పరిష్కారానికి కృషి
- అధికారుల కమిటీలో చర్చించి నిర్ణయాలు
- అక్కడ పరిష్కారం కాకపోతే మంత్రుల కమిటీలో చర్చ
- ఆ తరవాత సిఎంల కమిటీలో నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన భట్టి, అనగాని



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : సీఎంల భేటీలో అనేక అంశాలపై లోతుగా చర్చలు జరిగాయని.. పదేళ్లుగా పరిష్కారం కాని అంశాలపై చర్చించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో సీఎస్, ముగ్గురు సభ్యులు ఉంటారని చెప్పారు. సమస్యలు త్వరగా పరిష్కరించుకోవాలని నిర్ణయించామని అన్నారు. కమిటీ పరిష్కరించలేని సమస్యలపై మంత్రులతో కమిటీ వేస్తామని వెల్లడించారు. కమిటీల ద్వారా విభజన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసిన తర్వాత భేటీ వివరాలను భట్టి విక్రమార్క, ఏపీ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. గత పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని అంశాలపై సమావేశంలో మాట్లాడుకున్నాం. రెండురాష్ట్రాల ముఖ్యమంత్రులు కూలంకషంగా చర్చించిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాం. ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ వేయాలని నిర్ణయించాం. సీఎస్‌లు, ముగ్గురు అధికారులతో రెండు వారాల్లోగా కమిటీ ఏర్పాటు చేస్తాం. వీరి స్థాయిలో పరిష్కారం కాని సమస్యలపై మంత్రులతో మరో కమిటీని వేయాలని తీర్మానించాం. అక్కడ కూడా పరిష్కారం కాని అంశాలుంటే ముఖ్యమంత్రుల స్థాయిలో పరిష్కారమార్గం కనుగొనాలని నిర్ణయించాం అని వివరించారు.. అలాగే డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడికి రెండు తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించాం' అని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఏపీ మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు జాతి హర్షించే రోజు అని వ్యాఖ్యానించారు. విభజన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సీఎంలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ఏపీలోనూ చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఏపీ మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేశ్ తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. విభజన సమస్యలపై ప్రజా భవన్‌లో రెండు గంటలపాటు ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ఇరు రాష్ట్రాల మంత్రులతో ఉప సంఘం వేయాలని నిర్ణయం తీసుకున్నారు. శాఖలవారీగా చర్చల కోసం అధికారులతో మరో కమిటీ వేస్తామని సూత్రప్రాయంగా తెలిపారు. చర్చల ద్వారా, పట్టు విడుపులతో సమస్యలు పరిష్కరించుకోవాలని సమావేశంలో ముఖ్యమంత్రులు అంగీకారం తెలిపారు. నీటి పంపిణీపై మరోసారి సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారు. భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఏడు మండలాల్లో గల 5 గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలని చంద్రబాబును రేవంత్ రెడ్డి అడిగారని తెలిసింది. ఎటపాక, గుండాల, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు పంచాయతీలను విలీనం చేయాలని కోరినట్టు సమాచారం. ఇదే అంశంపై కేంద్ర హోం శాఖకు లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిసింది. హైదరాబాద్‌లో కొన్ని భవనాలు తమకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. అందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తిరస్కరించారని వార్తలు వస్తున్నాయి.

# మందకొడిగా పన్ను వసూళ్లు

## బకాయిలు రాబట్టడంలో నిర్లక్ష్యం

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : జంటనగరాల్లో ఇంటిపన్నుల వసూళ్లు మందగించాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇంటిపన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణాలు విస్తరించడం,కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డా ప్రజల ఆదాయవనరులు పెరగడం లేదు. దీంతో పట్టణాల్లో వ్యాపారాలు చితికి పోతున్నాయి. పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తుండగా, ఆ మేరకు ఆదాయం రావడం లేదు. పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు ఓవైపు మాల్స్, వ్యాపార సముదాయాలు, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగడం లేదు. మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాల విషయంలో కొందరు అద్దె చెల్లిస్తుండగా, మరికొందరు పెండింగ్‌లో పెట్టడంతో మునిసిపల్ ఆదాయం దెబ్బతింటోంది.లీజుకు తీసుకున్న వారు పెద్ద మొత్తంలో సబ్ లీజుకు దుకాణాలను ఇచ్చుకుంటున్నారు. దీనివల్ల కూడా రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. మునిసిపాలిటీకి పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది ఆస్తి పన్ను, దుకాణాల అద్దె, కొళాయిల పన్ను కలుపుకుని 50 శాతానికి మించి వసూలు కాలేదని సమాచారం. పన్ను వసూళ్ళలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల మునిసిపాలిటీకి రావాల్సిన మేర ఆదాయం రావడం లేదని తెలుస్తోంది. మాల్స్, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు విస్తరిస్తుండటంతో పట్టణం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు సమకూర్చాలంటే పన్నుల రూపంలో ప్రజలు ఆదాయం చెల్లించాల్సి ఉంది. అధికార యంత్రాంగం నిర్లిప్తత, కింది స్థాయి ఉద్యోగుల ఉదాసీనత కారణంగా సరైన అస్సెస్మెంట్ చేయకపోవడం వల్లే పట్టణం పరిగినంత వేగంగా ఆదాయం పెరగడం లేదని తెలుస్తోంది.మునిసిపాలిటీకి ఆదాయం ఆస్తి పన్ను, మునిసిపల్ దుకాణాల అద్దదె రూపంలో వస్తుంది. వ్యాపార, వాణజ్య సముదాయాలు, మాల్స్, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్‌లు, సినిమా థియేటర్లు, విద్యాసంస్థలు, షోరూంల నుంచి ఆదాయం ఎంతో రావాలి.



# ఘనంగా స్వాతంత్ర సమరయోధుడు డా .బాబు జగ్జీవన్ రామ్ గారి వర్ధంతి

అమలాపురం, తెలంగాణ ముచ్చట్లు : శనివారం నాడు అమలాపురం మండలం బండారులంక గ్రామపంచాయతీ ఆవరణలో అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన స్వాతంత్ర్య సమరయోధుడు డా. బాబు జగ్జీవన్ రామ్ గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు మాజీ శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చింత శంకరమూర్తి పుచ్చల వరదరాజు సెక్రెటరీ సురపు రాజు పిచ్చక శ్యామ్ బొట్టు పండు బండి మణికంఠ కాసిన పనింద్ర ఏకుల విజయ్ తులా సతీష్ కుందుర్తి జీవరత్నం ములపర్తి సునీల్ చంద్ర తొత్రముడి మురుగులమ్మ వాసా షణ్ముఖరావు ఈతకోట సోమరాజు జొన్నాడ నాగరాజు కొల్లు చిన్న ఈతకోట రాజేష్ జొన్నల పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి వేడుకలు

## జై భీమ్ ఎమ్మార్పీఎస్




మంత్రాలయం, తెలంగాణ ముచ్చట్లు : మంత్రాలయం మండల అధ్యక్షులు గాడిమోడి నరసింహులు మాదిగ స్థానిక బస్టాండ్ ఎదురుగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలేసి నివాళు లర్పించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... అణగారిన వర్గాన్ని అభ్యున్నతిలోకి తీసుకొచ్చేందుకు పోరాడిన యోధుడు,జనం కోసం జీవితాన్ని సంపూర్ణంగా అంకితం చేసి, 50 ఏళ్ల రాజకీయ జీవితం పోరాటానికి అంకితం చేసి,దేశంలోనే దళితుల్లో ఉప తొలి ప్రధానిగా పనిచేసి రాజకీయ జీవితంలో ఒక్క మచ్చ లేకుండా ఆయన ప్రత్యర్థులు పార్టీలతో శభాష్ అనిపించుకొని, 1986 సంవత్సరం జూలై 06 వ తేదీన తుది శ్వాస వదలడం జరిగినది. దళిత గిరిజనులకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కుడికన్ను అయితే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎడమ కన్ను. రాబోయే రోజుల్లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలను, ఆశయాలను జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముందుకు తీసుకువెళ్తామని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకాష్, ఇశ్రాయేలు, నరసింహులు, ప్రభుదాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభ లో పలు సమస్యలను పరిష్కరించాలని కోరిన గ్రామస్తులు



అమలాపురం, తెలంగాణ ముచ్చట్లు : శనివారం నాడు అమలాపురం మండలం బండారులంక గ్రామపంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ పెనుమల సునీత ఏడుకొండల అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది గ్రామంలో వివిధ చోట్ల సమస్యలను లేవనెత్తిన గ్రామస్తులు మొదటగా కందులపాడు కాలనీకి వెళ్ళు రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేసి రోడ్డు చేయవలసిందిగా తెలియపరిచారు అలాగే గ్రామంలో లోవోల్టేజ్ సమస్య తక్షణమే పరిష్కరించవలసిందిగా కోలారు జడ్పీ హైస్కూల్లో జరిగిన నాడు నేడు అవకతవకలను పరిష్కరించమని గ్రామస్తులు కోరారు మరియు గ్రామంలో మంచినీటి సమస్య ఉ ందని కోరారు సర్పంచ్ సునీత గారు సమస్యలు అన్నిటిని గౌరవ శాసనసభ్యులు శ్రీ అయితా బత్తుల ఆనంద రావు గారు దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు అందరూ పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన, స్కావెంజర్ లపై రాజకీయ వేధింపులు ఆపాలి - సిఐటియు





ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్స్ కు పెండింగ్ వేతనాలు వెంటనే ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు ముబారక్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డిమాండ్లతో కూడిన వినతిపత్రంను మండల విద్యాధికారి సురేష్ కి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన, స్కావెంజర్ లపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని మంచి లక్ష్యాలతో ఈ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నాయన్నారు. ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. ఈ పథకంలో పనిచేసే కార్మికులకు మాత్రం ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారితో వెట్టి చాకిరి చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు రూ.20 పెంచాలన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు పదివేల రూపాయలు వేతనం ఇవ్వాలన్నారు. ఈ పథకంలో పనిచేసే కార్మికులకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత, కార్మికులకు కల్పించాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సెలవులు, మేటర్నిటీ లీవ్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన, స్కావెంజర్స్ కార్మికులు మల్లీశ్వరి, లక్ష్మీదేవి, ప్రభావతి, బిచ్చమ్మ, నాగమ్మ, సమదానమ్మ, మరియమ్మ, సిఐటియు నాయకులు గణపతి, తదితరులు పాల్గొన్నారు.



## జీతాలు చెల్లించాలంటూ కార్మికుల రాస్తారోకో

ప్రకాశం తెలంగాణ ముచ్చట్లు : ప్రకాశం జిల్లా కొమరోలు పట్టణంలోని రాష్ట్ర ప్రధాన రహదారిలో పారిశుధ్య కార్మికులు , స్వచ్ఛభారత్ కార్మికులు రాస్తారోకో చేపట్టారు. 20 నిమిషాల పాటు వాహనాలు ఆగిపోగా, సమాచారం అందుకున్న కొమరోలు ఎస్సై, ఎంపీడీఓ నరసింహారావు ఇతర అధికారులు అక్కడికి చేరుకొన్నారు. సిఐటియు నాయకులు అంజమ్మ, కార్మికులతో అధికారులు మాట్లాడి, కార్మికులకు వేతనాలు అందేలా చూస్తామని చెప్పడంతో ప్రధాన రహదారిలో ధర్నా విరమించి పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా కొనసాగించారు. పారిశుధ్య పనులు చేసుకునే కార్మికులకు 30 నెలల జీతాలు ఆపటం చాలా దారుణం అని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు

## సీజనల్ వ్యాధులకు కేరాఫ్ అడ్రెస్ గా మారిన గిద్దలూరు



ప్రకాశం తెలంగాణ ముచ్చట్లు :ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని కోట గడ్డ ప్రాంతం లో దుర్గంధం వెదజల్లే అపరిశుభ్రతతో ప్రజల తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఈ ప్రాంతంలోనే కోటగడ్డ అర్బన్ హెల్త్ క్లినిక్, ఒక బాలికల జూనియర్ కళాశాల, బాలుర జూనియర్ కళాశాల రెండు బాలికల సంక్షేమ హాస్టల్లో కూడా ఉన్నాయి. ఈ విధంగా ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అపరిశుభ్రంగా ఉండడం వలన దుర్గంధం జరజల్లి చెత్త పేరుకుపోయి నీటినిలువలు ఉండడం వలన దోమలు ఉత్పత్తి చెంది డెంగీ ,మలేరియా వంటి వ్యాధుల ప్రజల సోకే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తాచెదారం నీటి నిల్వ లేకుండా పరిశుభ్రం చేసి, దోమల ఉత్పత్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి పౌరుడు కొనసాగించాలి ఆదోని ఎమ్మార్పీఎస్



ఆదోని,తెలంగాణ ముచ్చట్లు :శనివారం నాడు డా. బాబూ జగ్జీవన్ రామ్ గారి 38 వ వర్ధంతి సందర్భంగా గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వం బలపరుస్తూ స్థానిక ఆదోని తిమ్మారెడ్డి బస్టాండ్ సర్కిల్ నందు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహానికి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎస్ నాగప్ప మాదిగ, పిఎస్ వీరేష్ మాదిగ, పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ వారు మాట్లాడుతూలి స్వాతంత్ర్య సమరయోధులు, దళిత హక్కుల పరిరక్షకుడు, పరిపాలన దక్షకుడు, భారతదేశ మాజీ ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్ రామ్ గారి 38 వ వర్ధంతి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా జరుగునున్నాయి. దేశసమగ్రతకు, జాతి సమైక్యతకు కృషి చేసి,భారత రాజ్యాంగానికి కాపలాదారుడుగా వ్యవహరించి దళితుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారు ఆ మహనీయుని ఆశయాలను ఈ దేశంలో ఉండే ప్రతి పౌరుడు కొనసాగించలని అన్నారు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పేరును మార్చి వడ్డే ఓబన్న ప్రాజెక్టుగా నామకరణం చేయాలి

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస గారికి వినతి పత్రం



ఆత్మకూర్, తెలంగాణ ముచ్చట్లు : ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లశ్రీనివాస్ గారికి జాతీయ బీసీ సంక్షేమ , అభివృద్ధి సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు , రాష్ట్ర వడ్డెర సంఘ నాయకులు చల్లా ఇంద్రసేన, బత్తుల నాగేశ్వరరావు , నాగరాజు, దుర్గారావు మొదలగువారు కలిసి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పేరును మార్చి వడ్డే ఓబన్న ప్రాజెక్టుగా నామకరణం చేయాలని కోరారు . నంద్యాల జిల్లా నందికొట్కూరు తాలూకాలో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఉన్నది , నంద్యాల జిల్లా మొదటి తరం స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న ప్రాజెక్టుగా పేరు మార్చాలని అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతిని జనవరి 11వ తేదీన ప్రభుత్వం గుర్తించి జన్మదినాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని పక్క రాష్ట్రమైన తెలంగాణలో ఆ రాష్ట్ర ప్రభుత్వమే అన్ని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నదని కాబట్టి మన రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆయన జయంతిని ప్రభుత్వ లాంఛనాలతో చేయాలని జాతీయ బీసీ వెల్ఫేర్ మరియు అభివృద్ధి సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు , రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు చెల్లా ఇంద్రసేన , బత్తుల నాగేశ్వరరావు , నాగరాజు మొదలగువారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . నంద్యాల జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్నగారు రాయలసీమ రైతుల హక్కుల కోసం బ్రిటిష్ వారిని , బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన అధిక పన్నులను వ్యతిరేకంగా వలస పాలకులను బ్రిటిష్ దొరలను గడగడలాడించినటువంటి మొదటి తరం స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్నా, కావున ఇటువంటి మొదటి తరం స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవడం మన అందరి బాధ్యత , ముఖ్యంగా రాయలసీమ రైతులు , వారిని స్మరించుకునేలా పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు వడ్డే ఒబన్న గారి పేరు పెట్టాలని రాష్ట్రంలోని ప్రజా సంఘాలు , రాజకీయ పార్టీలు , యువజన సంఘాలు , మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు అందరం కలిసి కోరుచున్నాము

## సామాన్య ప్రజలకు దొరకని జగన్ దర్శనం

పులివెందుల, తెలంగాణ ముచ్చట్లు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల పర్యటనలో భాగంగా పులివెందుల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయానికి శనివారం సాయంత్రం చేరుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే అయిన జగన్ మోహన్ రెడ్డికి తమసమస్యలను చెప్పుకునేందు కుప్రజలుసాయంత్రం నుంచిక్యాంపుకార్యాలయం వద్దవేచి చూశారు. తమ గోడు చెప్పుకునేందుకు వచ్చిన సామాన్య ప్రజలకు అక్కడ చుక్కెదురైంది. జగన్మోహన్ రెడ్డి రావడం రావడం తన క్యాంపు కార్యాలయంలోకి వెళ్లిపోవడం ముందుగానే కార్యాలయం లోపల వందల కొద్ది చోట మోట నాయకులు ఆయన రాక కోసం వేచి చూస్తుండడంతో బయట బారికెడ్ల వద్ద నిలబడ్డ ప్రజలు లోపల ఉన్న వారందరిని పలకరించడానికిసమయం అంతాసరిపోతుంది ఇకతమ గోడుఎవరు వింటారు అని ఉసురుమంటూఅక్కడ నుండి వెనుతిరిగారు. తమ పార్టీకి చెందిన నాయకులకు కార్యకర్తలకు ఇచ్చిన విలువ ఓట్లేసి గెలిపించిన సామాన్య ప్రజలకు జగన్ ఇవ్వడం లేదంటూ అక్కడకు వచ్చిన ప్రజలు పెదవి విరవడం గమనార్హం.



## పాదయాత్రకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ముత్తుముల

ప్రకాశం తెలంగాణ ముచ్చట్లు : ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు ఎన్నికైన సందర్భంగా కంభం మండలం, తురిమెళ్ళ గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ గారి ఆధ్వర్యంలో నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి ఆలయం వరకు స్థానిక టీడీపీ, జనసేన యువకులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారికీ సంఘీభావం తెలియచేస్తూ గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు పాదయాత్ర చేపట్టిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాధ సుభద్ర, స్థానిక మరియు మండల ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## దళిత ముద్దుబిడ్డ డాక్టర్ బాబు జగజ్జీవరావు. 38వవర్ధంతి సందర్భంగా

### (శ్రీశైలందళిత సంఘాల నాయకులు)



ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు : శ్రీశైలం మండలం : డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 38 వ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్ నందు గల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో దళిత నాయకులు లక్ష్మయ్య దేవిడు, ఉమ్మడి జిల్లా.ఇఫ్ట్ జిల్లా అధ్యక్షులు ఆశీర్వాదము మండల కార్యదర్శి మల్లికార్జున, వలి తదితరులు పాల్గొన్నారు.


## మానవ హక్కుల అవగాహనా సదస్సును విజయవంతం చేయండి




కర్నూలు, తెలంగాణ ముచ్చట్లు : కర్నూలు నగరంలో మొట్టమొదటి సారిగా ప్రపంచ మానవ హక్కుల అవగాహనా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ భవన్ లో మానవ హక్కులపై రాష్ట్ర స్థాయి అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా చైర్మన్ సోమనాథ్ ,సిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవుడి మనుగడకోసం రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను తెలియజేసేందుకు సంస్థ జాతీయ చైర్మన్ కాసల కోనయ్య గారు హాజరవుతున్నారని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లాలో ఉన్న మానవహక్కుల సభ్యులతో పాటు ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయప్రదం చేయాలని కోరారు. మానవునికి ఉన్న హక్కులు ఏమిటి వాటిని ఎలా తెలుసుకోవాలి ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే అంశంపై జాతీయ చైర్మన్ గారు మరియు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వక్తల ద్వారా వివరించడం జరుగుతుందని కావున సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ఏరులై పారుతున్న మద్యం



- ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే విచ్చలవిడిగా అమ్మకాలుఎన్నికేసులైనా ఓకే
- మండల కేంద్రం లో గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు
- ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనం
- ఉదయం 6నుంచి 11, రాత్రి 7 నుంచి 11 గంటల వరకు డిమాండ్

స్టేషన్ ఘనాపూర్: తెలంగాణ ముచ్చట్లు : ఓ పల్లెలో పనిచేసే కూలీ సాయంత్రం పని ముగించుకొని ఇంటికి వచ్చేసరికి చీకటిపడింది. మద్యం మీద మనసు పడింది. పది కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేం ద్రానికి వెళ్తే కానీ మద్యం బాటిల్ తెచ్చుకోలేడు. అంత ప్రయాస ఎందుకులే అని ఊరుకుండేటోడు ఇల్లు పెళ్ళాము పిల్లలు క్షేమంగా ఉండటంలో కానీ ఇప్పుడు ఊర్లోనే గల్లికి ఒక్కరు చొప్పున మద్యం అమ్ముతున్నారు దూరం పోయి తెచ్చుకోవలసిన వ్యక్తి అందుబాటులో ఉన్న మద్యం దుకాణం వద్దకు వెళు న్నాడు రూ.150 విలువైన మద్యం బాటిల్‌ను అతడి నుంచి రూ.200కు కొనుగోలు చేస్తున్నాడు ఇదీ గ్రామాల్లో జరుగుతున్న తతంగం నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు విచ్చల విడిగా సాగుతున్నాయి. పట్టణ ప్రాంతాలు మొదలుకొని మారు మూల పల్లెల వరకు దాదాపు ప్రతి పంచాయతీ పరిధిలో మద్యం ఏరులై పారుతోంది. ఆ మద్యం విక్రయించే వ్యక్తి ఒకప్పటిలా చిన్న దుకాణం పెట్టుకుని ఉండడు. సాధారణంగా అందరిలో కలిసిపోయే వ్యక్తే అయి ఉంటాడు. ఒకప్పుడు రహస్యంగా తన ఇంట్లో నుంచో, తెలిసిన వాళ్ల ఇంట్లోనే ఉంచి అమ్ముతుండేవాళ్ళు కానీ ఇప్పుడు అదేది లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి మన రాష్ట్రంలో దొరికే మద్యమే. మద్యపాన ప్రియులు పెరిగిన రీతిలోనే బెల్ట్‌షాపులు ఎక్కువ య్యాయి. అలా కంటికి కనిపించని బెల్ట్‌షాపులు మండల కేంద్రంలో ని గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చేశాయి. చూడటానికి మద్యమే అయినప్పటికీ కమీషనలో మాత్రం పెద్ద వ్యాపారమే జరుగుతోంది. అమ్మకాల ఆధారంగా వారం లేదా పది రోజులు టార్గెట్‌గా పెట్టుకొని మద్యం బాటిళ్లు తీసుకెళ్తుంటారు. కొందరు 30 నుంచి 50వరకు పరిమితమైతే, ఇంకొందరు కేసుల కు కేసులకే తీసుకు వెళ్తుంటారు. ఒక్కో కేసుకు 48 మద్యం బాటిళ్లు వస్తాయి. ఇలా పెద్ద సంఖ్యలో కొనేవారు మద్యం షాపులో పనిచేసేవారికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 కమీషన ఇస్తారని సమాచారం. ఇలా కమీషన్లు పుచ్చుకుంటూ ఎన్ని కేసులైనా ఇచ్చేస్తారని సమాచారం. దీనికి తోడు అలా మద్యం విక్రయించినందుకు సైతం టార్గెట్ పూర్తవుతుంది. ఇక ఆ మద్యం తీసుకొచ్చి విక్రయించే వారు బయటివారికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అధికంగా విక్రయిస్తుంటారు. అందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు, డిస్కొంటులు ఉండవట.



**విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు...**

-జిల్లా పట్టణం, మండలం గ్రామం అనే తేడా లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారు. అయినా పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారు రోజుకో గొడవ పోలీస్ స్టేషన్లో భార్యాభర్తల మధ్యలో గొడవలు భూతగాధాలు ఎటు వెళ్లిన ఏ గ్రామంలోనైనా విచ్చలవిడిగా పుట్టగొడుగుల్లాగా గల్లికో బెల్ట్ షాపు పెట్టి గ్రామాల్లో తాగుబోతులను తయారు చేసే ఫ్యాక్టరీలుగా పనిచేస్తున్న బెల్ట్ షాపులు ఇప్పటికైనా గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టుకోకపోతే గ్రామాల్లో ప్రజలు వారి కుటుంబాలు దయ దీన స్థితిలోనికి వెళ్ళిపోయే పరిస్థితి ఉన్నది మైనర్లు సైతం వెళ్లిన బెల్ట్ షాపుల్లో మధ్యాన్ని విక్రయిస్తున్నారు నిరుపేదలు పొద్దంతా పనులకు వెళ్లి ఇంటికి వచ్చి ఇంత బుక్కెడు బువ్వ తిని పండుకునే పరిస్థితులు కానరావడం లేదు మద్యం మత్తులో ఇంటికి వచ్చిన వారు పిల్లలు చూసే పరిస్థితి లేదు భార్యను పట్టించుకునే పరిస్థితి లేదు కుటుంబాలు కుప్పకూలిపోతా ఉన్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గ్రామాల్లో విచ్చలవిడిగా మందు అమ్ముతున్న బెల్ట్ షాపులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు గుడి బడి తేడా లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు చేపట్టాలి

# సిఎంల భేటీపై బిఆర్ఎస్ అక్కసు

- సమస్యలు పరిష్కారం కావడం వారికి ఇష్టం లేదు
- గత పదేళ్ల పాలనా కాలమే ఇందుకు నిదర్శనం
- కెసిఆర్ తీరు దారుణంగా ఉందన్న తీన్మార్ మల్లన్న

హైదరాబాద్,జూలై6 : ఇరు తెలుగు రాష్ట్రాల సమస్యలను పరిష్కరించే విదంగా ఇద్దరు సిఎంలు భేటీ కావడం శుభపరిణామమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఇరు రాస్ట్రాల ప్రజలు కలిసిమెలసి జీవించాలన్న ఆకాంక్ష ఇంఉదలో ఉందన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో పరిష్కారం కానీ సమస్యలపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి.. శనివారం సాయంత్రం ప్రజాభవన్‌లో భేటీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హైదరాబాద్‌లో స్పందించారు. ఇలా ఈ ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ శుభసూచకమని తెలుగు రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారన్నారు. రాష్ట్రాలు విడిపోయినా.. అన్నదమ్ముల వలె విభజన హామీల పరిష్కారం కానీ అంశాలు పరిష్కారం కోసం ఈ చర్చ జరుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్రం పట్ల ఉన్న ప్రేమ అందరికీ అర్ధమవుతుందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు తెలుగు ముఖ్యమంత్రులు మాట్లాడుతుంటే.. దీనిని రాజకీయంగా ఉపయోగించుకొని బురద చల్లాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. సీఎంల భేటీ.. కేసీఆర్‌తోపాటు ఆయన పరివారానికి నచ్చడం లేదన్నారు. గత ముఖ్యమంత్రులు కేసిఆర్, జగన్‌లు పదేళు స్వార్ధ రాజకీయాల తప్ప.. సమస్యల పరిష్కారం కోసం కనీసం చర్చ కూడా చేయలేదని ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న గుర్తు చేశారు. అలాగే నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా ఇంట్లో చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తా అని సీఎం కేసిఆర్ గతంలో చెప్పారన్నారు. అయితే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపారని.. మరి ఆ విషయాన్ని నేడు ఇంతగా రచ్చ చేయడం చూస్తుంటే.. హంతకులే సంతాపం తెలిపినట్లుగా ఉందని బీఆర్ఎస్ నేతల వైఖరిపై తీన్మార్ మల్లన్న నిప్పులు చెరిగారు. పార్టీలు వేరు, ప్రభుత్వాలు వేరని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం పని చేస్తుందన్నారు. ఆంధ్రా నుంచి రావాల్సిన వాటా వదిలిపెట్టి ఇక్కడి సంపద అక్కడికి బీఆర్ఎస్ నేతలు తరలించారని ఆరోపించారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఇప్పటికైనా ప్రతిపక్ష పాత్ర పోషిస్తే బాగుంటుందని తీన్మార్ మల్లన్న ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇరు రాష్ట్రాల సీఎంలా భేటీని వివాదం చేయాలని చూస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతల వైఖరిపై మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఆర్థిక, భూ దోపిడీ చేసిందని.. ఆ పార్టీ ప్రజా సమస్యలపై ఎప్పుడు ఆలోచన చేయలేదన్నారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తెలంగాణను.. కుక్కలు చింపిన విస్తరి చేశాడంటూ కేసీఆర్‌పై తీన్మార్ మల్లన్నా ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. కేసిఆర్ పార్టీ దినదిన గండం అన్నట్లు సాగుతుందన్నారు. కేసిఆర్ గతంలో చేసిన పాపాలను సీఎం రేవంత్ రెడ్డి కడగల్సిన పరిస్థితి ఉందన్నారు. గతంలో సీఎంలు కేసిఆర్, జగన్‌లు చీకటి భేటీ లయ్యేవారన్నారు. ప్రతి దానిలో కేసిఆర్ కుటుంబం రాజకీయ ప్రయోజనాలు చూస్తుందన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల ప్రయోజనాలు చేస్తున్నారని వివరించారు. తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నా సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజల తరుపున తీన్మార్ మల్లన్న ధన్యవాదాలు తెలిపారు.

# కొనుగోళ్లు జరక్క కంది రైతుల అవస్థలు

రంగారెడ్డి,తెలంగాణ ముచ్చట్లు : అష్టకష్టాలు పడి పండించిన పంటను సైతం రైతన్న అమ్ముకోలేక దిగాలు పడుతున్నాడు. రేయింబవళ్లు కష్టపడి, ఎకరాకు 10వేల నుంచి రూ.20వేలు పెట్టుబడి పెట్టి పండించిన పంటకు ధర అందక రైతన్న కుదేలవుతున్నాడు. మద్దతు ధరకైనా అమ్ముకుందామంటే కొనేవారు లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారు. నిన్నటి దాక పత్తి అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడిన రైతులు నేడు కందులు విక్రయించడానికి అవస్థలు పడుతున్నారు. మార్కెట్లలో రాశులు పోసి కొనేవారికోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, ప్రారంభించిన చోట కొనుగోలు లేక రైతులు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. గతంలో కందులు హాకాసంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేవారు. ఇప్పుడు హాకాసంస్థ కొనుగోలు చేయట్లేదు. దాంతో కందుల కొనుగోలు బాధ్యతను మార్కెఫెడ్ సంస్థకు అప్పగించారు. అటు సహకార సంఘాల సిబ్బంది ఎన్నికల హడావుడిలో ఉండటంతో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన చోట కూడా కందులు కొనుగోలు చేయడం లేదు.

# బిఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

-తలలు పట్టుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

-ఎవరు పార్టీ వీడుతారో అర్థం కాని పరిస్థితి

-సైలెంట్‌గా చేరిపోయిన బండ్ల కృష్ణమోమన్ రెడ్డి

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఊహించని పరిణామాలే చోటుచేసుకుంటున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ఎప్పుడు గులాబీ కండువా తీసేసి.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కారు దిగి హస్తం గూటికి చేరడం.. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారనే వార్తలతో పార్టీ పరిస్థితి ఏంటనేది హైకమాండ్‌కే తెలియక తలలు పట్టుకుంటోంది..! ఈ క్రమంలో గద్వాల ఎ మ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా సిఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే మూకుమ్మడిగా కాకుండా ఒకకొక్కరుగా పార్టీని వీడడం అర్థం కావడం లేదు. సరిగ్గా ఈ క్రమంలోనే తెలంగాణ భవన్ వేదికగా జరుగుతున్న బీఆర్ఎస్ కీలక సమావేశానికి పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. అసలే మరో ఆరుగురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారనే వార్తల నేపథ్యంలో భేటీ జరగడం.. ఈ సమావేశానికి కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే అనుమానాలకు తావిచ్చినట్లయ్యింది. తొలిరోజు సమావేశానికి రాలేదు సరే.. రెండో రోజు కూడా హాజరుకాకపోవడంతో పార్టీ మార్పు పక్కా అనే వార్తలు గుప్పుమంటున్నాయి.

జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం జరుగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో వేదికగా కీలక సమావేశం నిర్వహించడం జరిగింది. అయితే.. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోగా శనివారం జరిగన కౌన్సిల్ సమావేశానికి రాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. కౌన్సిల్ భేటీకి ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాష్ గౌడ్, మహిపాల్ రెడ్డి డుమ్మా కొట్టారు. కౌన్సిల్ భేటీకి కచ్చితంగా హాజరుకావాలని అధిష్ఠానం నుంచి ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు ఏమయ్యారు..? బీఆర్ఎస్‌కు బై బై చెప్పడానికి రంగం సిద్ధం చేసుకున్నారా..? లేకుంటే మరేదైనా కారణాలతో డుమ్మా కొట్టారా అనేది తెలియట్లేదు. రాష్ట్ర రాజధాని పరిధిలో బీఆర్ఎస్‌కు 14 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ఏడుగురు శక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి రాలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 నియోజక వర్గాలకుగాను 16 బీఆర్ఎస్ గెలుచుకుంది. కండువాల మార్పిడి సీజన్ నడుస్తోన్న సమయంలో ఒకరోజు ముందు సమాచారమిచ్చి మరీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌కు హైదరాబాద్‌లోనే ఉండి కూడా కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడం పార్టీ మారుతారనే వార్తలకు బలం చేకూరుతోంది. నిన్నటి సమావేశానికి.. తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సనత్‌నగర్), పద్మారావు (సికింద్రాబాద్), ప్రకాష్‌గౌడ్ (రాజేంద్రనగర్), సుధీర్‌రెడ్డి (ఎల్‌బీనగర్), మాగంటి గోపినాథ్ (జూబ్లీహిల్స్), ముఠా గోపాల్ (ముషీరాబాద్), కాలేరు వెంకటేష్(అంబర్‌పేట) హాజరయ్యారు. అయితే.. అరెకపూడి గాంధీ(శేరి లింగంపల్లి), మాధవరం కృష్ణారావు(కూకట్‌పల్లి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(మల్కాజ్‌గిరి), కేపీ వివేకానందగౌడ్ (కుత్బుల్లాపూర్), సబితా ఇంద్రారెడ్డి(మహేశ్వరం), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు)లు రాలేదు. దీంతో ఇవాళ అయినా.. కౌన్సిల్‌కు వస్తారనుకుంటే రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి.

# సినిమా న్యూస్



# వైద్యులతో వివాదం: సామ్‌కు తారల గట్టి మద్ధతు




వైరల్ ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడానికి ఉపయోగించే హైడ్రోజన్ పెరాక్సైడ్ కోసం నెబ్యులైజర్‌ను ఉపయోగించాలని తన అభిమానులకు, ప్రజలకు సూచించారు సమంత రూత్ ప్రభు. చాలా ఖర్చు చేస్తేనే కానీ, కొన్ని రకాల మెడిసిన్స్ సామాన్యులకు అందవని, అందినా కొన్నిసార్లు రుగ్మతలు తగ్గవని, అనుభవంతో తన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ విషయంలో తాను చాలా అదృష్టవంతురాలినని, ఖరీదైన వైద్యాన్ని తాను మాత్రం చేయించుకోగలిగానని అన్నారు. మాత్రలు మింగే కంటే నెబ్యులైజర్ ని సరైన విధానంలో ఉపయోగించాలని ప్రత్యామ్నాయాన్ని సూచించింది. అయితే ఇది ధర్మ వైద్యులకు రుచించలేదు. %ఒ% ఖాతాలో పలువురు వైద్యులు సమంతపై దుమ్మెత్తిపోశారు. తమ పొట్ట కొడుతున్న ఆవేదన వైద్యుల్లో కనిపించింది. ఒక వైద్యుడు అదే పనిగా సమంతపై వ్యాఖ్యల దాడి చేసాడు. సమంతను జైల్లో వేయాలని కూడా కోపాన్ని ప్రదర్శించాడు. అయితే దీనికి సమంతా వివరణాత్మక నోట్‌తో మళ్లీ సోషల్ మీడియాల్లో స్పందించారు. ఇప్పుడు, వరుణ్ ధావన్, కియారా అద్వానీ సహా చాలా మంది నటీనటులు సమంతకు మద్ధతుగా నిలిచారు. సెలబ్రిటీలు చాలా మంది సమంతా రూత్ ప్రభు ఇటీవలి పోస్ట్‌పై స్పందించారు. చాలా మంది సెలబ్రిటీలు సమంత ఆలోచనా విధానానికి ఆకర్షితులై ప్రేమగా మద్దతునిచ్చారు. బంగాళాదుంపలు పొటాటోస్‌గా మారాయి అని రియా చక్రవర్తి వ్యాఖ్యానించారు. కియారా అద్వానీ, తాహిరా కశ్యప్, రకుల్ ప్రీత్ సింగ్, మానుషి చిల్లర్ సహా పలువురు ఇతర ప్రముఖులు సమంత పోస్ట్‌ను ఇష్టపడ్డారు. వరుణ్ ధావన్ కామెంట్స్‌లో హార్ట్ ఎమోజీని కూడా షేర్ చేసారు. తనను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేసిన వైద్యుని గురించి సమంత ఇలా రాసింది. ఒక పెద్దమనిషి నా పోస్ట్‌పై .. నా ఉద్దేశాలపై బలమైన పదాలతో దాడి చేశాడు. పెద్దమనిషి డాక్టర్ ని అని కూడా చెప్పాడు. అతడికి నాకంటే ఎక్కువ తెలుసు అనడంలో సందేహం లేదు. అతడు తన మాటలతో రెచ్చగొట్టకుండా ఉంటే అది అతని పట్ల దయగా ఉండేది. %ఒ% ఖాతాలో %ఒష్ట్రమాఅజవతీణశీఎ% హ్యాండిల్‌ని ఉపయోగించే ఒక వైద్యుడు, శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్‌లను నివారించడానికి , చికిత్స చేయడానికి హైడ్రోజన్ పెరాక్సైడ్‌ని పీల్చమని తన మిలియన్ల మంది అనుచరులకు సలహా ఇచ్చినందుకు సమంతా రూత్ ప్రభుని విమర్శించారు. అతడు ఇలా రాసాడు, %--%హేతుబద్ధమైన శాస్త్రీయంగా ఎదిగిన ప్రగతిశీల సమాజంలో ఈ మహిళ ప్రజారోగ్యానికి హాని కలిగించే సలహా ఇచ్చినందుకు తనపై అభియోగాలు మోపాలి. జరిమానా వేయాలి. కటకటాల వెనుక్కి పంపాలి. ఆమెకు సహాయం చేసేవారు లేదా ఆమె బృందంలో మంచి సలహాదారు కావాలి అని ఒక వైద్యుడు తీవ్రంగా ఎటాక్ చేసాడు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.... సమంత తన తదుపరి వెబ్ సిరీస్ సిటాడెల్: హనీ బన్నీ రిలీజ్ కోసం వేచి చూస్తోంది. వరుసగా ప్రాజెక్టులకు కమిటైంది. సొంత బ్యానర్ లోను నిర్మాతగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.

# ఇల్లి బేబ్ గట్టిగా ట్రై చేస్తుంది కానీ..?



తెలుగులో దేవదాస్ సినిమాతో పరిచయమై సూపర్ స్టార్ మహేష్ తో పోకిరి తో స్టార్ క్రేజ్ తెచ్చుకున్న గోవా బ్యూటీ ఇలియానా తన స్టార్ డం ని కొన్నాళ్ల వరకే పరిమితం చేసుకుంది. తెలుగుతో పాటుగా తమిళ సినిమాల్లో కూడా నటించిన అమ్మడు అక్కడ కూడా అదరగొట్టేసింది. ఐతే తెలుగులో కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే ఇలియానా బాలీవుడ్ బాట పట్టింది. బర్ఫీ సినిమాతో హిందీ పరిశ్రమలోకి అడుగు పెట్టిన అమ్మడు ఆ సినిమా తో అక్కడ చాలా హోప్స్ పెట్టుకుంది. అంతేకాదు హిందీ సినిమాల కోసం సౌత్ సినిమాలను నెగ్లెక్ట్ చేసింది. ఫలితంగా అమ్మడు అక్కడ స్టార్ రేంజ్ అందుకోలేదు సరికదా సౌత్ సినిమా ఆఫర్లను మిస్ చేసుకుంది. ఐతే తిరిగి మళ్లీ తెలుగు ఆఫర్ల కోసం ప్రయత్నించినా వర్క్ అవుట్ కాలేదు. ఇక సినిమాల్లో ఎలాగు కెరీర్ బాగా లేదని క్లారిటీకి రావడంతో ఆస్ట్రేలియా ఫోటో గ్రాఫర్ తో డేటింగ్ చేసింది. ఐతే అతన్ని పెళ్లాడుతుందని అనుకోగా అతనికి దూరమైంది. అతను వెళ్లాడా లేదా ఇలియానానే అతన్ని దూరం చేసుకుందా అన్నది తెలియదు కానీ ఇల్లి బేబీ మళ్లీ ఒంటరిదైంది. ఐతే అలా కొన్నాళ్లే ఉన్న అమ్మడు మళ్లీ తన తోడుని వెతుక్కుంది. మైఖెల్ డోలన్ తో కొన్నాళ్లు డేటింగ్ చేసిన ఇలియానా అతనితో ఒక బాబుని కూడా కనేసింది. ఇదిలా ఉంటే ఇలియానా మళ్లీ తిరిగి సినిమాల్లోకి రావాలని చూస్తుంది. తనకు స్టార్ డం తెచ్చిన తెలుగు పరిశ్రమ మీదే అమ్మడు గురి పెట్టుకుని కూర్చుకుంది. తనకు అవకాశం ఇవ్వాలని గట్టిగా ట్రై చేస్తుంది ఇలియానా. మొన్నటిదాకా సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో ఫ్యాన్స్ ని అలరించిన అమ్మడు ఇప్పుడు అదే క్రేజ్ తో సినిమా ఛాన్సులు అందుకోవాలని చూస్తుంది. ఇలియానా చివరగా తెలుగులో అమర్ అక్బర్ ఆంటోని సినిమాలో నటించింది. ఆ తర్వాత ఒక్కరంటే ఒక్కరు కూడా ఆమెను తీసుకోలేదు. ఐతే బాలీవుడ్ లో మాత్రం అరకొర అవకాశాలతో కెరీర్ వెళ్లదీస్తుంది. తెలుగులో ఇల్లి బేబ్ కి క్రేజీ ఫ్యాన్స్ ఉన్నారు. ఐతే ఏదైనా సినిమా ఛాన్స్ వస్తే మాత్రం నో లిమిట్స్ అనే రేంజ్ లో అందాల ప్రదర్శనకు సిద్ధం అవుతుంది అమ్మడు. ఏం చేసైనా సరే తెలుగులో మళ్లీ బిజీ అవ్వాలని చూస్తుంది ఇలియానా. మరి అమ్మడిని ఎవరైనా పట్టించుకుంటారా లేదా అన్నది చూడాలి.

# మాల్వీ మల్హోత్రా సినిమా రిలీజ్ కాకుండానే కాంట్రవర్సీ



మాల్వీ మల్హోత్రా పేరు ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఈమె గురించి సోషల్ మీడియాలో తెగ సెర్చ్ చేస్తున్నారు. తిరగబడర సామి సినిమాలో రాజ్ తరుణ్ కి జోడీగా ఈ నార్త్ ఇండియన్ బ్యూటీ టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. అయితే ఈ మూవీ ఇంకా రిలీజ్ కాకుండా మాల్వీ మల్హోత్రా తెలుగు ఇండస్ట్రీలో సెన్సేషన్ గా మారిపోయింది. ఈ సినిమా కంటే ముందు మాల్వీ హిందీలో ఒక సినిమా, మలయాళంలో ఒక మూవీ చేసింది. అయితే తెలుగులో రాజ్ తరుణ్ సినిమా ఆమెని ఏకంగా కాంట్రవర్సీలో పడేసింది. రాజ్ తరుణ్ ప్రియురాలు లావణ్య మాల్వీ మల్హోత్రా పైన తీవ్ర ఆరోపణలు చేస్తోంది. రాజ్ తరుణ్ ని నాకు కాకుండా చేయాలని మాల్వీ మల్హోత్రా ప్రయత్నం చేస్తుందని, నన్ను ఆమె అన్నయ్యతో కలిసి బెదిరిస్తుందని లావణ్య ఆరోపిస్తుంది. మా నాన్నకి హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి బాగా క్లోజ్, నిన్ను చంపేసి డెడ్ బాడీ కూడా కనిపించకుండా మాయం చేస్తాం అంటూ వార్నింగ్స్ ఇస్తుందని లావణ్య పోలీసులకి ఫిర్యాదు చేసింది. ఈ బెదిరింపుల నేపథ్యంలోనే ప్రాణ రక్షణ కోసం పోలీసులకి ఫిర్యాదు చేశానని మీడియాతో తెలిపింది. అలాగే నాతో 11 ఏళ్ళు రిలేషన్ లో ఉండి, పెళ్లి చేసుకుంటానని ప్రామిస్ చేసి రాజ్ తరుణ్ మోసం చేసాడని లావణ్య ఆరోపిస్తుంది. వారి బంధువులు కూడా రాజ్ తరుణ్ ని వదిలేయాలని బెదిరిస్తున్నారని మీడియాకి తెలియజేసింది. అయితే మాల్వీ మల్హోత్రా కూడా ఈ ఆరోపణలపై లీగల్ యాక్షన్ తీసుకోవడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. రాజ్ తరుణ్ కెరియర్ పరంగా మళ్ళీ గాడిలో పడే ప్రయత్నం చేస్తున్నాడు. అతను చేసిన తిరగబడర సామి మూవీ రిలీజ్ కి రెడీ అయ్యింది. దీని తర్వాత పురుషోత్తముడు సినిమా కూడా ఈ ఏడాదిలోనే రానున్నట్లు తెలుస్తోంది. అలాగే మరో సినిమా కూడా సెట్స్ పైకి వెళ్లబోతోందంట. కొన్ని నెలల క్రితం అతని ప్రియురాలు లావణ్య డ్రగ్స్ కేసులో పట్టుబడింది. ఆ సమయంలో అనవసరమైన వివాదాలకి దూరంగా ఉండాలని అనుకున్నాడంట. అందుకే లావణ్యని విడిచిపెట్టి బయట కొచ్చేసాడంట. అయిన కూడా లావణ్య రాజ్ తరుణ్‌ని బలవంతంగా రోడ్డు మీదకి లాక్కొని వచ్చింది. ఈ వివాదం రాజ్ తరుణ్ కెరియర్ కి ఎంతో కొంత విఘాతంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. అలాగే హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఇమేజ్ కూడా దెబ్బ తీస్తుందని, టాలీవుడ్ లో అవకాశాలు దూరం అయ్యే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. లావణ్య తన ఫిర్యాదు విషయంలో వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. రాజ్ తరుణ్ కూడా ఇంత వరకు వచ్చాక నేను తగ్గను అంటూ లావణ్యపై లీగల్ గా ఫైట్ చేయడానికి రెడీ అయ్యాడు. ఈ ఇష్యూ మరి ఎంత వరకు వెళ్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాజ్ తరుణ్ అయితే తన వైపు నుంచి లావణ్య చేసిన ఆరోపణల విషయంలో క్లారిటీ ఇచ్చారు. మాల్వీ మల్హోత్రాతో రిలేషన్ లో లేనని చెప్పారు. అలాగే తనకి డ్రగ్స్ అలవాటు లేదని, కానీ లావణ్య బాగా ఎడిక్ట్ అయ్యిందని అన్నారు. పెళ్లి గురించి లావణ్యకి నేనెప్పుడు ప్రామిస్ చేయలేదని క్లారిటీ ఇచ్చాడు.



# డేటింగ్ గురించి ఓపెనైన సీరత్

సీరత్ కపూర్ ఇటీవలే దశాబ్దం కెరీర్ రన్ పూర్తి చేసుకుంది. ఆమె మొదటి చిత్రం రన్ రాజా రన్ 2014లో థియేటర్లలో విడుదలైంది. యాధృచ్ఛికంగా ఈ జూన్‌లో విడుదలైన తన తాజా విడుదల %-%మనమే%-% కోసం ఆమె తన మొదటి సహనటుడితో మళ్లీ స్క్రీన్‌ను షేర్ చేసుకుంది. మొదటి నుండి శర్వానంద్ , నేను నటులుగా ఈ ఇన్‌స్టంట్ కనెక్షన్‌ని కలిగి ఉన్నాము.. ఇది కాలక్రమేణా మెరుగుపడింది! అని సీరత్ వెల్లడించింది. తాజా ఇంటర్వ్యూలో సీరత్ మాట్లాడుతూ.. శర్వానంద్‌తో మళ్లీ పనిచేయడం గురించి నిజాయితీగా ఉంది. అలాగే నటుడు అమన్ ప్రీత్ సింగ్‌తో డేటింగ్ పుకార్ల గురించి ప్రస్తావించింది. దశాబ్దం పాటు తను ఇష్టపడే వాటిని చేసానని, మరిన్ని నచ్చే చిత్రాలు చేస్తానని సీరత్ అన్నారు. మనమే లో సీరత్ తాన్యగా నటించింది. రన్ రాజా రన్ సహనటుడు శర్వాతో కలిసి మళ్లీ పని చేసే అవకాశం ఇచ్చినందున వెంటనే ప్రాజెక్ట్‌కి ఓకే చెప్పానని సీరత్ తెలిపింది. శర్వానంద్ అద్భుతమైన నటుడు, అతను చేసే పాత్రలను ఎంచుకోవడానికి ధైర్యం అవసరం. ఎంపికల్లో ఎప్పుడూ ప్రామాణికతను కోల్పోడు అనే వాస్తవం తెలుసుకుని నేను ఎల్లప్పుడూ ప్రేరణ పొందాను.


**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**

**TELTEL12273** Website : www.telanganamuchatlu.in "Mail I'd: telanganamuchatlu.in@gmail.com